# దాగుడుమూతలు

ఆదిశేషు ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోయిందని చెప్పాడు డాక్టర్ ఆనంద్. ఆ మాట వినగానే రైలు తన మీదగా వెళ్ళిపోయినంత బాధపడ్డాడు ఆదిశేషు పెద్దకొడుకు సుదర్శనం.

"డాక్టర్.... మా నాన్నకు వచ్చిన జబ్బేమిటి?" అనడిగాడు సుదర్శనం షాక్‌నుంచి తేరుకుని.

"ఏ జబ్బయితేనేమిటి ప్రాణం తియ్యటానికి?" అని విసుక్కున్నాడు డాక్టర్.

"అయితే ఇప్పుడే వెళ్ళి మా బంధువులందరికీ టెలిగ్రాంలు ఇస్తాను" అన్నాడు సుదర్శనం అక్కడనుంచి వెళ్లబోతూ.

"ఏమిటా తొందర? పేషెంట్ దగ్గర ఎవ్వరూ లేకుండా నువ్వు వెళ్ళిపోతావా?" అన్నాడు డాక్టర్ ఆనంద్ మందలింపుగా.

"మా నాన్న కోమాలో వున్నారుగదా డాక్టర్. నేను వున్నదీ లేనిదీ ఆయనకెలా తెలుస్తుంది?" అంటూ అక్కడ నిలవకుండా. వస్తున్న దుఃఖాన్ని లెక్కచెయ్యకుండా పొడుగ్గా వున్న ఆ హాస్పిటల్ వరండాలో నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

తన గదిలోకి వెళ్ళిపోయాడు డాక్టర్ ఆనంద్.

బెడ్‌మీద ఆదిశేషు మాత్రం తనకేమీ పట్టనట్టు కోమాలో జోగుతున్నాడు.

ఆదిశేషుకు వారంరోజుల క్రితం వున్నట్టుండి కీళ్ళు పట్టుకుపోయాయి. వాళ్ళింటి పక్కనే వున్న ఒక కీళ్ళరోగ దీర్ఘరోగి చెప్పిన మందులను తీసుకువచ్చి తండ్రికిచ్చాడు సుదర్శనం.

కానీ ఆ మందులు పని చెయ్యలేదు.

"ఆ రోగిష్టి వెధ చెప్పిన మందులను ఎందుకు తీసుకువచ్చావురా? డాక్టరు దగ్గరకు వెళితే బావుండేది" అన్నాడు ఆదిశేషు కొడుకుని.

"దీర్ఘరోగి అంటే నాలుగోవంతు డాక్టరంటారు కదా! అందుకే వెళ్ళాను. సాయంత్రం డాక్టరు దగ్గకెళ్దాం. నేను ఆఫీసునుంచి వచ్చేసరికి నువ్వు రెడీగా వుండు" అని ఆఫీసుకు వెళ్ళాడు సుదర్శనం.

అయితే సాయంత్రం వరకు ఆదిశేషు ఆగలేకపోయాడు. కొడుకు వెళ్ళిన రెండు గంటలకు ఆయనకు ఛాతీలో కొద్దిగా మంట బయల్దేరింది. దాని అనుభవిస్తున్నప్పుడే కాళ్ళూ, చేతులు లాగడం మొదలుపెట్టాయి. ఆ బాధను కూడా

ఫీలవుతున్నప్పుడు గుండెలో ఏదో పట్టేసినట్లనిపించింది.

ఆ విధంగా కేవలం మూడు గంటల్లో నాలుగైదు రకాల రోగ లక్షణాలను – మూడు నాలుగు రకాల శిక్షలను ఏకకాలంలో అనుభవించే ఖైదీలా ఆదిశేషు కూడా ఒకేసారి అనుభవించాడు.

ఆయన బాధను చూసిన కోడలు లలితకు అంతకంటే బాధ కలిగింది. వెంటనే ఆ రోడ్డు చివర వున్న లాయర్‌గారింటికి వెళ్ళి వాళ్ళ ఫోన్‌లో సుదర్శనానికి ఆదిశేషు రోగ లక్షణాలను వివరించి – "మీరు వెంటనే బయల్దేరండి" అన్నది చివరగా.

"నేను రావడం కుదరదు లలితా. ఒక పని చెయ్యి. పగలే కాబట్టి మా నాన్నను రిక్షాలో వేసుకొని డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళు. ఆయన్ని నేనొచ్చే వరకు జాగ్రత్తగా చూడమని డాక్టర్‌తో చెప్పు.

ఎందుకైనా మంచిది ఆయనకు ఓ వంద రూపాయలు అడ్వాన్స్‌గా ఇవ్వు. లేకపోతే మా నాన్న మనకు దక్కడు. అర్థమైందా?" అన్నాడు చివర్లో.

"సాయంత్రం ఆఫీసు నుంచి హాస్పిటల్‌కి రండి" అని ఫోన్ పెట్టేసింది లలిత.

ఆమె ఇంటికి వచ్చేసరికి ఆదిశేషు కళ్ళు మూస్తూ తెరుస్తూ మూలుగుతున్నాడు వెరైటీగా.

లక్కీగా రోడ్డుమీద ఖాళీగా పోతున్న రిక్షాను ఆపి మామగారిని అందులో వేసుకొని డాక్టర్ ఆనంద్ హాస్పిటల్‌కు తీసుకువెళ్ళింది. అదృష్టవశాత్తూ డాక్టర్ పేకాటకు వెళ్ళకుండా నర్స్ రత్నకుమారితో సరసమాడుతూ హాస్పిటల్‌లోనే వున్నాడు.

డాక్టర్ విసుక్కుంటూ ఆదిశేషును కొంచెంసేపు పరీక్షించి "కంగారు లేదు. వృద్ధాప్యంలో ఇలాంటి వెదవరోగాలు మామూలే" అన్నాడు.

"ఇంతకీ మా మామగారికి ఏం రోగం?" అనడిగింది లలిత కుతూహలంగా.

"ఏ రోగమని చెప్పేది? రొటీన్‌గా పరీక్ష చేశాను. దాదాపు పన్నెండు రకాల పరీక్షలు చేస్త గానీ నేనే రోగమో చెప్పలేను. మీవారిని ఆఫీసు నుంచి రాగానే నన్ను కలవమని చెప్పండి" అన్నాడు.

"అప్పటిదాకా ఆయన బతుకుతాడా?" అనుమానంగా అడిగింది లలిత.

"మీకు ఆ భయం అవసరం లేదు. నా హాస్పిటల్‌కు వచ్చిన ఏ రోగినీ

నేనిక్కడ చావనివ్వను. నాకు సాధ్యం కాకపోతే రోగి ప్రాణం పోవటానికి కనీసం ఐదు నిముషాల ముందైనా ఇంకో డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళమని చెబుతాను" అన్నాడు నవ్వుతూ.

ఆ మాటతో తేలిగ్గా నిట్టూర్చింది లలిత.

భర్త వచ్చే వరకూ మామగారి దగ్గర కూర్చుంది లలిత. ఆదిశేషు వెరైటీ మూలుగు వినలేక డాక్టర్ ఆనంద్ నిద్రపుచ్చే ఒక ఇంజెక్షన్‌ను ఆయన జబ్బలో గుచ్చి బయటకు లాగాడు. జబ్బలో సూది గుట్టిన బాధతో, వస్తున్న నిద్రతో – రెండింటి సంఘర్షణలో ఎప్పటికో నిద్రపోయాడు ఆదిశేషు.

సాయంత్రం సుదర్శనం రావటంతోనే "నాన్నా.... నాన్నా" అంటూ ఆదిశేషుని కుదిపి కదలకపోవటంతో "నాన్న.... పోయావా?" అంటూ పెద్ద కేక పెట్టాడు ఏడుపుతో.

అప్పుడు లలితకు గుర్తుకువచ్చి "ఆయన లేవడు. డాక్టర్ మత్తు ఇంజెక్షన్ ఇచ్చాడు" అన్నది.

భర్తతో డాక్టర్ చెప్పిన మాటలన్నింటినీ చెప్పింది లలిత. అతను వెంటనే నర్స్‌ను నవ్విస్తున్న డాక్టర్ ఆనంద్‌కు కలుసుకున్నాడు.

"పదండి.... రాత్రి లోపల మీ నాన్నగారికి కనీసం ఆరు పరీక్షలైనా చేయించాలి" అంటూ ఆదిశేషు దగ్గరకు వచ్చాడు డాక్టర్.

ఆదిశేషుని నిద్రలేవటానికి ప్రయత్నించి చివరకు ఆయనకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చిన విషయం గుర్తుకు వచ్చింది కాబోలు ఇంకో ఇంజెక్షన్ లోడ్ చేసుకువచ్చి ఆదిశేషు జబ్బలో గుచ్చాడు.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు ఆదిశేషు.

"నాన్నా" అన్నాడు సుదర్శనం తండ్రి లేచాడన్న సంతోషంతో పెద్దగా.

"గుర్తుపట్టానురా వెధవా.... పెద్దగా అరవకు" చిరాకుపడుతూ అన్నాడు ఆదిశేషు.

"ఇప్పుడు చేయించాల్సిన పరీక్షలు రాసుకొస్తాను" అంటూ డాక్టర్ తన గదిలోకి వెళ్ళాడు.

"పరీక్షలేమిటి?" అన్నాడు ఆదిశేషు సందేహంగా.

"నీకు డజను పరీక్షలు చేయిస్తేగానీ నీ రోగమేమిటో తెలీదుట" అన్నాడు సుదర్శనం.

"వద్దు. డబ్బులు కాజెయ్యటానికి ఇదంతా నాటకం. లక్షణాలనుబట్టి రోగం తెలుసుకోవాలి. అన్ని రకాల పరీక్షల్లో డాక్టరుకు కమీషన్లుంటాయి. నీకు తెలుసుగదా మన ఊళ్ళో డాక్టర్ రావు జలుబుక్కూడా ఐదు రకాల ఎక్స్‌రేలు తీయిస్తాడు. అందుకే పరీక్షలంటే నాకు భయమని చెప్పు" అన్నాడు ఆదిశేషు.

కానీ డాక్టర్ వినలేదు.

"ముందు ఈ పరీక్షలు చేయించండి. మీ నాన్నగారిని పాతికేళ్ళవాడిలా తయారుచేస్తాను" అని తొందరచేసి వాళ్ళిద్దరినీ పరీక్షల నిమిత్తమై పంపాడు.

లలిత ఇంటికి వెళ్ళిపోయింది.

పరీక్ష రిపోర్టులు వచ్చినా ఆదిశేషుకు వచ్చిన రోగం ఏమిటో డాక్టర్ ఆనంద్‌కు అర్థం కాలేదు.

"ఏమన్నా అర్థమయ్యిందా డాక్టర్?" అన్నాడు సుదర్శనం విచారంగా.

ఏదో రోగం పేరు చెప్పకపోతే బావుండదని" అయాం సారీ ఆదిశేషుగారికి పక్షవాతం వచ్చే సూచనలు తీవ్రంగా కనపడుతున్నాయి. నాలుగైదు రోజుల్లో రావచ్చు" అన్నాడు వాతావరణకేంద్రం వారిలా.

"థాంక్స్ డాక్టర్.... ఇంకా నయం. హార్ట్‌ఎటాక్ లాంటిదని చెబుతారేమోనని భయపడ్డాను" అన్నాడు సుదర్శనం గొప్ప రిలీఫ్‌తో.

"దీనికంటే అదే నయం. ఒక్కసారిగా హాయిగా వెళ్ళిపోవచ్చు. పక్షవాతం వస్తే ఆయనకు చాకిరీ చెయ్యలేక మీకు హార్ట్‌ఎటాక్ వస్తుంది" అన్నాడు డాక్టర్.

పక్షవాతం రావచ్చునని తండ్రికి చెప్పాడు సుదర్శనం.

"నేను పుణ్యాత్ముడినిరా.... పక్షవాతం రాదు. ఏకంగా చావే వస్తుంది. అందుకే మగ వెధవలనీ, ఆడ పక్షులనీ అందరినీ పిల్లల్ని తీసుకురమ్మని టెలిగ్రాంలు ఇవ్వు" అన్నాడు ఆదిశేషు.

"ఇప్పుడెందుకు నాన్నా ఆ మాటలు" అన్నాడు సుదర్శనం బాధగా.

"అంటే ఏమిటి? టెలిగ్రాంలు ఇవ్వవా?"

"ఇస్తాను నాన్నా" అని అక్కడినుండీ గబగబా వెళ్ళిపోయాడు సుదర్శనం.

అతను వెళ్ళగానే డాక్టరు వచ్చి "సరిగ్గా పడుకోండి.... ఇంజెక్షన్ ఇస్తాను" అన్నాడు.

"వద్దు" అన్నాడు ఆదిశేషు భయంగా.

"నొప్పే వుండదు.... ఒక్కసారి కిటికీలోంచి ఆ వేపచెట్టును చూడండి" అంటూ దున్నపోతులకు ఇంజెక్షన్ చేసే పశువుల డాక్టర్‌లా ఆదిశేషుకు ఇంజెక్షన్ చేసి గర్వంగా వెళ్ళాడు డాక్టర్ ఆనంద్.

ఆరోజు సాయంత్రానికి రకరకాల రోగాలతో ఐదారుగురు పేషెంట్లు ఆ హాల్లో వున్న మంచాలమీద చేరిపోయారు.

"ఆదిశేషుగారి బోణి మంచిది కదూ. పేషెంట్లు బాగా వచ్చారు" అన్నాడు డాక్టర్ సంతోషంగా.

"అవును బాస్" అన్నది రత్నకుమారి.

"ఆయనకు ఫీజులో రెండు శాతం డిస్కౌంటు ఇద్దాం" అన్నాడు మళ్ళీ.

"అంతేకాదు. ఆయన బతికి ఇంటికి వెళితే వారానికి ఒకసారి మన హాస్పిటల్‌లో పేషెంటుగా చేరమని రిక్వెస్టు చేద్దాం" అన్నది నర్స్.

ఆదిశేషుని జాగ్రత్తగా ట్రీట్ చెయ్యటానికి నిర్ణయించుకున్నాడు డాక్టర్ ఆనంద్. అయినా ప్రయోజనం లేకుండాపోయింది.

సుదర్శనం ఇచ్చిన టెలిగ్రాంలు అందుకున్న ఆదిశేషు కొడుకులూ, కూతుళ్ళూ పిల్లలతో సహా వచ్చేసరికి ఆయన పూర్తిగా కోమాలోకి వెళ్ళిపోయాడు. ప్రతి రెండు గంటలకీ ఆయన ఒకసారి కోమాలో నుంచి బయటకు వచ్చి సరిగ్గా పది నిముషాల తర్వాత మళ్ళీ కోమాలోకి వెళ్ళిపోవడం మొదలుపెట్టాడు క్రమం తప్పకుండా.

సరిగ్గా డాక్టర్ ఆనంద్ చెప్పిన టైముకే స్పృహలోకి వచ్చాడు ఆదిశేషు.

వెంటనే ఆదిశేషు రెండో కూతురు భానుమతి "నాన్నా.... నన్ను గుర్తుపట్టావా?" అన్నది.

ఆదిశేషు అదోలా నవ్వి "గుర్తుపట్టకపోవటానికి నువ్వేమైనా మారువేషంలో వున్నావా?".... అందరినీ గుర్తుపట్టానే.... మిమ్మల్నందరినీ చూసి తృప్తిగా చావాలని నేనే పిలిపించాను" అన్నాడు.

"అవేం మాటలు నాన్నా.... ఇప్పుడు నీకెన్నేళ్ళు? అరవై రెండు. మా వీధిలో రామదాసుకు ఎనభై యేళ్ళుంటాయి. ఇంకా సైకిల్‌మీద ఇంగ్లీషు సినిమాలకు వెళుతున్నాడు" అన్నది భానుమతి.

"నీకు తెలీదే భానూ.... ఆ రామదాసు పాపాత్ముడై వుంటాడు. పాపులు ఎక్కువకాలం బతుకుతారు. నేనలా కాదు. అదుగో.... అప్పుడే నాకోసం

దేవదూతలు వచ్చారు" అంటూ ఎదురుగా వున్న డాక్టర్‌నీ, నర్స్‌నీ చూపించాడు ఆదిశేషు.

వాళ్ళంతా ఆదిశేషు ధోరణి చూసి సమయం దగ్గర పడిందని అనుకున్నారు.

ఆదిశేషు ఉన్నట్టుండి "అల్లుళ్ళెవరూ రాలేదా?" అనడిగాడు తన మొహంమీదికి వంగి ఆదుర్దాగా చూస్తున్న రెండో అల్లుడిని.

"నేను మామయ్యా.... కాశీపతిని" అన్నాడతను.

"ఎవరే భానుమతీ ఇతను?" అని పెద్దకూతురు భూలక్ష్మిని అడిగాడు.

ఎవ్వరూ మాట్లాడలేదు. అంతా కలిసి కూడబల్కున్నట్టు ముగ్గురు కూతుళ్ళూ ఒక్కసారి పెద్దగా ఏడ్చారు తండ్రి పరిస్థితి చూసి.

అల్లుళ్ళు ఏడ్వాలా? వద్దా? అనే ఆలోచనలో వుండిపోయారు.

"ముసలాయనకు మతి పోయినట్లుంది" అనుకున్నారు కోడళ్ళు చిన్నగా.

వాళ్ళు ఏడుస్తున్నప్పుడు పది నిముషాలయిందన్నట్టు మళ్ళీ కోమాలోకి జారిపోయాడు ఆదిశేషు. ఇహ అక్కడ వుండి ప్రయోజనం లేదని అంతా ఇంటికి వెళ్లిపోయారు రెండో కూతురు, అల్లుడు తప్ప.

ఆ మరుసటిరోజు ఉదయం ఏడు గంటల సమయంలో ఆదిశేషు పక్కనే వున్న బెడ్‌మీద పేషెంట్‌కు పరిస్థితి విషమించింది. ఇంకో ఐదు నిముషాల్లో ఆయన చనిపోతాడనగా డాక్టర్ ఆనంద్ ఆయన్ని ఎవరైనా పెద్ద డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళమని తొందరచేసి పంపించాడు. ఆ పేషెంట్‌ని రోడ్డుమీదకు తీసుకువెళ్ళి రిక్షాలోకి ఎక్కించగానే ఉన్నట్టుండి రోదనలు వినిపించాయి డాక్టర్‌కూ, ఇతర పేషెంట్లకూ.

భయంగా చూసుకున్నారు పేషెంట్లంతా. ఆదిశేషు కోమాలో వున్నాడు కాబట్టి భయపడలేదు.

ఒక్కరోజు గడిచింది.

డాక్టర్ ఆనంద్ జాగ్రత్తగా ట్రీట్ చేస్తున్నాడు. ఆదిశేషుని సాయంత్రం నాలుగ్గంటల సమయంలో ఆదిశేషుకు స్పృహ వచ్చింది.

అప్పటివరకూ తండ్రి పక్కనే కూర్చున్న సుదర్శనం తండ్రికి స్పృహ వచ్చిన సమయంలో వరండాలోకి వెళ్ళి నర్స్ రత్నకుమారితో కబుర్లు చెపుతున్నాడు – సిగరెట్టు కాలుస్తూ.

తల తిప్పి పక్క బెడ్‌మీదకు చూశాడు ఆదిశేషు. కొత్తగా ఆ బెడ్‌మీద చేరిన నలభై యేళ్ళామె ఆయనకు కనపడింది. ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి మరీ మళ్ళీ ఆమెను చూశాడాయన.

ఆమె మొహాన బొట్టు లేదు. తెల్లగా సన్నగా వుంది. చేతులకు గోల్డు కవరింగ్ గాజులున్నాయి. కొత్తగా చేరిందని ఊహించాడు.

హఠాత్తుగా ఆదిశేషు ఆలోచనలు ఇరవై యేళ్ళ క్రితం స్వర్గానికి వెళ్ళిపోయిన భార్యమీదకు మళ్ళాయి. ఎంతమంది చుట్టూ వున్నా భార్య దారి వేరు కదా అనుకున్నాడు. ఆడదానిమీదకు ఆలోచనలు వెళ్ళాక పక్క బెడ్‌మీద ఆమెను పదే పదే చూశాడు.

ఆమెను చూస్తే రోగపీడితలాగా అనిపించలేదు. తలకింద చెయ్యి పెట్టుకుని పైకి చూస్తూ పడుకున్నది. డబ్బున్న మనిషిగా అనిపించలేదు.

మొగుడు లేడని ముందే అనుకున్నాడు. ఆదిశేషు చూస్తుండగానే పదిహేనేళ్ళ అబ్బాయి వచ్చి ఆమె బెడ్ పక్కనే వున్న బల్లమీద కూర్చున్నాడు.

ఇంకో రోజు గడిచింది.

ఆదిశేషుకు టెంపరేచర్ చూసి పరీక్ష చేసిన డాక్టర్ “ఆశ్చర్యంగా వుంది. నా హాస్పిటల్‌లో ఇంత వేగంగా ఏ రోగి కోలుకోలేదు. మీ నాన్నగారి ఆరోగ్యం చాలా మెరుగయ్యింది. ఇంకేం భయం లేదు. రెండ్రోజుల్లో ఇంటికి పంపుతాను” అన్నాడు సుదర్శనంతో.

“థాంక్ యూ డాక్టర్”

ఆదిశేషుకు ప్రాణభయం లేదని డాక్టర్ చెప్పగానే అంతా తిరిగి ఊళ్ళకు వెళ్ళిపోయారు.

సమయం చూసుకుని పక్క బెడ్‌మీద ఆమెతో మాటలు కలిపాడు ఆదిశేషు. మిగిలిన పేషెంట్లంతా నిద్రపోతున్నారు ఆ టైములో.

ఆయన ఊహించినట్టుగానే ఆమెకు రెండేళ్ళ క్రితం మొగుడు పోయాడట ప్రమాదంలో. బతికుండగా ఆయన వంటలు చేసేవాడుట. ఆయన పోయాక ఆయన ఉద్యోగం తను చేస్తోందిట. ఏదో అనారోగ్యంతో హాస్పిటల్‌లో చేరిందట.

అంతా విని ఆదిశేషు తన కుటుంబ విషయాలను ఆమెతో చెప్పారు. చివరకు ఇరవై యేళ్ళుగా తను ఆడదాని తోడు లేకుండా వుంటున్నానని– ఎంతమంది వున్నా భార్య లేని లోటును ఎవ్వరూ తీర్చలేరనీ అన్నాడు. అంతేకాకుండా తనకున్న

ఆస్తి గురించిన వివరాలను కూడా ఆమెతో చెప్పాడు.

ఆమె ఆదిశేషు చెప్తున్న విషయాలు వింటూ నవ్వింది. ఒంటరి జీవితమంత నరకం రెండోది లేదంటూ ఒప్పుకున్నది.

అప్పుడు ఆదిశేషులో ఏవేవో ఆలోచనలు పరుగులు తీశాయి. ఆ వంటలామెను తను పెళ్ళి చేసుకుంటే బావుంటుంది కదా అనుకున్నాడు.

కానీ – ఆమె ఒప్పుకుంటుందా?

ఆ సాయంత్రం ఆదిశేషు ఆరోగ్యం మరింత మెరుగయ్యింది. ఆయనలో ఈ మార్పుకు డాక్టర్ తీరిగ్గా ఆశ్చర్యపోయాడు. తన మందులు బాగా పని చేశాయని, తన ట్రీట్‌మెంట్‌కు ఇంత బలముంటుందనీ అనుకుంటే ఆయనకు నమ్మశక్యంగా లేదు.

ఆ రాత్రి నిద్రలో ఆదిశేషుకు ఆమెతో కలిసి నాలుగైదు సినిమాలకు వెళ్ళినట్టు, ఆమె – ఆయనకు ఏదో టిఫిన్ స్వయంగా తన చేతితో తినిపించినటట్టూ కలలు వచ్చాయి. ఉన్నట్టుండి మరురోజు ఉదయం పది గంటల సమయంలో ఆదిశేషు పరిస్థితి పూర్తిగా క్షీణించిపోయింది.

దాంతో మళ్ళీ అందరికీ టెలిగ్రాంలు ఇచ్చిన సుదర్శనం తిరిగి వచ్చి "చెప్పండి డాక్టర్... నాన్న పరిస్థితి మళ్ళీ ఎందుకు ఇలా విషమించింది. అసలేం జరిగింది" అనడిగాడు.

"అంతా మిస్టరీగా వుంది. వైద్యరంగానికే అర్థంకాని ప్రశ్న ఇది. అసలెందుకు కోలుకున్నాడో అర్థం కాలేదు. ఇప్పుడెందుకిలా దిగజారిపోయాడో తెలీటం లేదు. నేనేమీ చెప్పలేను. నో కామెంట్" అన్నాడు డాక్టర్ ఆనంద్ నొసలు చిట్లించి.

మళ్ళీ అంతా పిల్లలతో ఊళ్ళనుంచి వచ్చారు.

ఆదిశేషు చుట్టూ చేరారు. "లాభం లేదు. కేవలం గంటల్లోకి వచ్చింది. విల్లు రాయకపోతే రాయించుకోండి" అన్నాడు శ్రేయోభిలాషిలా.

సరిగ్గా అప్పుడే సంధి ప్రేలాపనలా ఆదిశేషు ఏదో గొణిగాడు. నాలుగైదుసార్లు ఆయన పెదవులు ఏదో మంత్రాన్ని జపిస్తున్నట్లు కదిలాయి.

డాక్టరు ఆయన మీదకు వంగి ఒక నిముషం తర్వాత "ఆదిశేషుగారు కమలా.... కమలా.... అంటూ గొణుగుతున్నాడు. ఆ పేరున్నవాళ్లు మీలో ఎవరైనా వున్నారా" అనడిగాడు.

"ఎవ్వరూ లేరండి" అన్నది భూలక్ష్మి.

"ఎవరో తెలుసుకుని వెంటనే పిలిపించండి. ఆ మనిషిని చూస్తేగానీ ఈయన నిశ్చింతగా పైకి పోలేడు" అన్నాడు డాక్టర్ ఆనంద్.

డాక్టర్ ఇలా మాట్లాడుతున్నప్పుడు రత్నకుమారి "ఇటు రావయ్యా.... ఆ కమల ఎవరో చెబుతాను" అని డాక్టర్ ఆనంద్ చెయ్యి పట్టుకుని లాగింది.

"నీకు తెలుసా?"

"నీకూ తెలుసు.... మర్చిపోయావు. కమలంటే ఈయన పక్క బెడ్‌మీద వుండి నిన్న ఉదయం తొమ్మిదిన్నరకు డిశ్చార్జయి వెళ్ళిన కమలమ్మ" అన్నది నర్సు రత్నకుమారి.

"మైగాడ్...." అంటూ పెద్దగా అరిచాడు డాక్టర్ ఆనంద్ సంతోషంతో.... ఆదిశేషు ఆరోగ్యం ఉన్నట్టుండి ఒక్కసారిగా మెరుగై మళ్ళీ అంతలోనే ఎందుకు క్షీణించిందో అర్ధమై.

సరిగ్గా అప్పుడే ఆదిశేషు పక్కనే వున్న మనుషులంతా ఒక్కసారి పెద్దగా ఆర్తనాదాలు చేశారు.

మొదటిసారిగా తన హాస్పిటల్‌లో ఒక జీవి గాలిలో కలిసిపోయినందుకు బాధపడుతూ మౌనంగా వుండిపోయాడు డాక్టర్ ఆనంద్. ❖

*స్వాతి వారపత్రిక, 23-1-1998*